క్లుప్తంగా

ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్‌వీలర్ సర్వీస్ అసిస్టెంట్ టెక్నీషియన్(ఫోర్ వీలర్ మెకానిక్) శిక్షణకు కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలన్నారు. సూయింగ్ మిషన్ ఆపరేటర్ (టైలరింగ్) కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలన్నారు. ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రెండు పాస్ ఫొటోలతో హాజరై దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79937 95796 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్డు భద్రతపై సూచనలు చేస్తున్న ఎస్‌ఐ

భామిని: వాహన చోదకులు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని బత్తిలి ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్ సూచించారు. బత్తిలిలో రోడ్డు భద్రతా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రజ్ఞ, హర్షలు తొలుత వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై చైతన్యం చేశారు. శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని, రాగి, ఎరుపు రంగు మచ్చలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చర్మంపై నూనె రాసినట్లు మెరుస్తూ కొంచెం దళసరిగా ఉండే మచ్చలు, చల్లని లేదా వేడి వస్తువులు తాకినా స్పర్శ తెలియకపోవడం వంటివి వ్యాధి లక్షణాలు అని, అవి మనలో కనిపిస్తే వెంటనే ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించి సలహాలు సూచనలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని, రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనులు చేయించాలని, ఉదయం ఏడు గంటలకే పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయాలి

సీతానగరం: గ్రామాల్లో పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వినియోగదారులంతా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ ప్యానల్ వేయించుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకుల సమీక్ష సమావేశంలో హౌసింగ్ లబ్ధిదారులను కలెక్టర్ ఆదేశాల మేరకు మండలాధికారులు సచివాలయ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకు నేందుకు విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ పాపారావు వివరాలను తెలియ జేశారు. గ్రామంలో 350 యూనిట్స్ దాటిన జాబితాను ఎంపీడీఓ కార్యదర్శులకు ఇస్తూ లక్ష్యాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. హౌస్‌హోల్డ్ సర్వే డేటాలో తప్పులున్నాయని వాటిని సరిచేసి డేటాను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

యోగాసనాలతో ఆరోగ్యం

క్రమం తప్పకుండా యోగాలో కీలకమైన సూర్య నమస్కారాలను అనుసరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని యోగా శిక్షకులు ధనుంజయ అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక యోగా ప్రదర్శన చేపట్టారు. రుషీ యోగా కేంద్రంలో 108 సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు. చేబోదుల రామారావు, కందుల శ్రీను, అంధవరపు వాసు, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

–పాలకొండ రూరల్



బడి కోసం ఆందోళన



మండలంలోని యు.వెంకమ్మపేట ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను చిదిమి గ్రామంలోని పాఠశాలకు తరలిస్తారంటూ వచ్చిన వార్తలపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాల వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించాలని చూడాలే తప్ప, పేద పిల్లలకు కూటమి ప్రభుత్వం చదువును దూరం చేయాలని చూస్తోందని సర్పంచ్ ప్రతినిధి సొంట్యాన సింహాచలం అన్నారు. సుమారు 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న చిదిమి గ్రామానికి ఇక్కడ విద్యార్థులు ఎలా వెళ్లగలరని వీరు ప్రశ్నించారు. కనీసం అవగాహన లేకుండా విద్యా శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది పద్ధతి కాదన్నారు. తమ గ్రామం నుంచి పాఠశాలను తరలించాలని చూస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

– వీరఘట్టం

ఆపదలో అండగా నిలవండి



సిబ్బందికి కరపత్రాలు అందజేస్తున్న ఎంవీఐ తదితరులు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాలు సంభవించే సమయంలో క్షతగాత్రులకు మనం అందించే సాయం వారి ప్రాణ రక్షణకు దోహదపడుతుందని మోటారు వెహికల్ అధికారి టి.వేణుగోపాలరావు అన్నారు. పాలకొండ ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ తరహాలో క్షతగాత్రులకు సాయపడే వారికి రూ.5వేలు పారితోషికం ప్రభుత్వం అందించనున్నట్టు తెలిపారు. డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిబంధనలను అనుసరించి వాహనాలు నడపడం వల్ల సమస్యలు తలెత్తవని, అనుకోని ఇబ్బందులు ఎదురై గాయాల పాలైనపుడు మానవత్వం చాటుకునే వారిని గుర్తించడం, ప్రోత్సహించేందుకు తీసుకునే చర్యలపై విస్తృత ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీటికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి పి.నారాయణరావు, ఎంఎఫ్ ఎల్.రాము, భాసూరు కృష్ణమూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలల గర్భిణులను వసతిగృహానికి చేర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

గుమ్మలక్ష్మీపురం: ఏడు నెలలు నిండిన గర్భిణులను మండల కేంద్రంలోని వైటీసీలో నిర్వహిస్తున్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహానికి చేర్చాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీఎస్ పద్మావతి సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో మంగళవారం సమావేశమైన ఆమె.. తొలుత రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని, గర్భిణులు సుఖప్రసవానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు ఎం.బుద్ధేశ్వరరావు, అఖిలాష్, సీహెచ్‌వో పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధంకండి



టెన్త్ విద్యార్థిని ఇంటికి వెళ్లి చదువుపై ఆరాతీస్తున్న డిప్యూటీ ఈఓ, హెచ్‌ఎం

వీరఘట్టం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రశాంతంగా చదవాలని ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి సూచించారు. బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రత్నాకరరావుతో కలిసి మంగళవారం గ్రామంలోని పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సమయం సమీపిస్తుందని, అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. టీవీలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు కేశవరావు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

8న టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష



టెన్త్ విద్యార్థులకు పరీక్ష గురించి వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు గంగారావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 8వ తేదీన ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ కురుపాం మండల నాయకుడు ఆరిక గంగారావు తెలిపారు. మంగళవారం అదే పాఠశాలను ఆయన సందర్శించి, పరీక్ష నిర్వహణ, రాసే విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నెలకొన్న పరీక్షల భయం పోగొట్టేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, తప్పని సరిగా విద్యార్థులంతా ఈ పరీక్షకు హాజరుకావాలని కోరారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు.

మత్స్య సంపద అభివృద్ధే లక్ష్యం



వల్లరగుడబ చెరువులోకి చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎఫ్‌డీవో శ్రీదేవి

గరుగుబిల్లి: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా మండలంలోని చినగుడబ, వల్లరగుడబ తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి మంగళవారం చేపపిల్లలు విడుదల చేశారు. ఎఫ్‌డీవో(మత్స్యశాఖ అభివృద్ధి అధికారి) వై.శ్రీదేవి మాట్లాడుతూ మత్స్య సంపద అభివృద్ధితో పాటు మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు 1,33,000 చేపపిల్లలను మత్స్యకారులకు అందజేశామన్నారు. రావుపల్లిలోని దేశపాత్రుని చెరువులో 12,400, గరుగుబిల్లిలోని జగన్నాథ పట్నాయక్ చెరువులో 13 వేలు, గుర్రం చెరువులో 3 వేలు, ఉద్దవోలులోని తామర చెరువులో 2,800, దళాయివలసలోని కొంకమయ్య చెరువులో 12,500, వల్లరగుడబలోని కృష్ణసాగరంలో 36 వేలు, చినగుడబలోని కోనం చెరువులో 15,040, పక్కివాని చెరువులో 10,680, సన్యాసిరాజుపేటలోని గంగసాగరంలో 28 వేల చేపపిల్లలను విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.కీర్తి, సీహెచ్ కూర్మినాయుడు, పి.భాస్కరరావు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



స్టోర్ రూం తనిఖీ చేస్తున్న డీడీ అన్నదొర

సీతంపేట: విద్యార్థులకు సక్రమంగా మెనూ అందజేయాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర అన్నారు. ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థినిల మెనూ, స్టోర్ రూం పరిశీలించారు. రికార్డులు, హాజరు చూశారు. కాసేపు విద్యార్థినిలతో ముచ్చటించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట పీఎంఆర్‌సీ ఏఎంఓ కోటిబాబు ఉన్నారు.

రహదారి నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దు

- అధికారులను ఆదేశించిన పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో చేపట్టే సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడవద్దని ప్రాజెక్ట్ అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని హెచ్.కారాడవలస గ్రామంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలో నిర్మించే రహదారి పనుల నాణ్యతాప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీపడరాదని, పక్కాగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

మక్కువ: క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు వైద్యసిబ్బందికి సూచించారు. ఈ మేరకు మక్కువ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని, వైద్యసిబ్బందితో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తహీనత నివారణ, పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం శంబర జాతరలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని చినమేరంగి ఎస్‌ఐ అనీష్ సూచించారు. మండలంలోని దాసరిపేట వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాల్లో ప్రయాణాలు చేయరాదన్నారు. వాహనాలతో బయటకు వెళ్లేటప్పుడు వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. అతివేగంతో వెళ్లవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కాసులు తదిరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనీష్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపక బృందం

గుమ్మలక్ష్మీపురం: ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులంతా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం కోరారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల, బాలురు జూనియర్ కళాశాలల్లో ఓపెన్ డే(అడ్మిషన్స్ క్యాంపెయిన్) మంగళవారం నిర్వహించారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ డి.రామయ్య.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలతో పాటు అక్కడ చదువుకున్న వారికి అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, నైపుణ్య శిక్షణా తరగతులను వివరించారు. 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరాలనుకునే వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వరూప, తులసి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రావివలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతు పలికి గెలిపించాలని వారు ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జి.సత్యనారాయణ, పి.ధనంజయరావు, బి.రవికుమార్, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని నాగూరులో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పలు పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంటలు, అధిక దిగుబడులకు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలన్నారు. ఏటా ఒకే పంట పండించకుండా ఒక్కో ఏడాది ఒక్కో రకమైన పంట వేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు తర్వాత రబీ సీజన్‌లో డ్రైస్ సోయింగ్ విధానంలో ప్రధాన పంట మినుముతో పాటు మొక్కజొన్న, కంది, పెసలు, ఉలవలు పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ పి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రథసప్తమి



మూలవిరాట్‌ను తాకుతున్న సూర్యకిరణాలు

పాలకొండ: రథసప్తమి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బల్లంకివీధిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయంలో అభిషేకాలు, అలంకరణ, నీరాజనం, మంత్ర పుష్పాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి మూల విరాట్‌పై సూర్యకిరణాలు తాకడంతో భక్తులు ఈ సుందర దృశ్యాన్ని తిలకించారు. సాయంత్రం కోలాటం, మంగళవాయిద్యాలతో తిరువీధి నిర్వహించారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



వెంకమ్మ చెరువులో చేపపిల్లలు విడిచిపెడుతున్న మత్స్యకారులు, అధికారులు

వీరఘట్టం: చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మత్స్యశాఖ సహాయకులు ఖండాపు కామేశ్వరరావు అన్నారు. 60 శాతం సబ్సిడీపై మత్స్యకారులకు అందజేసిన రూ.24,600ల విలువ గల చేపపిల్లలను మంగళవారం తెట్టంగితో పాటు స్థానిక వెంకమ్మచెరువులో విడిచిపెట్టారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు అరసాడ పాపారావు, సెక్రటరీ జనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: స్పీకరు అయ్యన్నపాత్రుడు గిరిజనుల 1/70 చట్టం సవరించాలని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ శంకరరావు కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్పీకరు మాట్లాడిన మాటలు గిరిజనుల పట్ల వివక్షను, కార్పొరేట్ శక్తులకు గిరిజన ప్రాంతాలను అప్పగించేలా ఉన్నాయన్నారు. గిరిజనులంతా బంద్‌లో పాల్గొని, స్పీకరు వైఖరిని తప్పుబట్టాలని, గిరిజనుల సత్తాచాటాలని కోరారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ

భామిని: గిరిజన ప్రాంతాల్లో చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ కె.సింహాచలం రైతులకు సూచించారు. మండలంలోని మనుమకొండ, భామినిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. రాగుల పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చిరుధాన్యాలతో ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ పత్తిక మురళి, రైతు సంఘం అధ్యక్షుడు గురుగుబిల్లి లక్ష్మీపతినాయుడు, వ్యవసాయ సహాయకులు అలికాన ఎర్రన్న, రైతులు పాల్గొన్నారు.